**భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

# కీడు

## మ.రా.శాస్త్రి

కొండమీద కొండంత దేవుడు కొలువున్నాడు. ఆస్తిపాస్తులున్న దేవుడు కావడంతో హడావిడికి కొదవలేదు. భక్తుల సంఖ్య ఊరు దాటి యేరు దాటి, జిల్లాదాటి, రాష్ట్రందాటి వ్యాపించి వుంది.

కొండక్రింద కొండచిలవంత బద్ధకంగా ఈ చిగురునుంచి ఆ చిగురువరకు పరచుకున్న ఊరు. ఊళ్ళో ఓ పెద్ద వాస్తుశాస్త్ర పండితుడున్నాడు. వాస్తుశాస్త్రంలో పాండిత్యం ఎంత వుందో తెలియదు. కానీ, వాస్తుమీద నమ్మకం కలిగించడంలో మహా దిట్ట. మనుషులన్నాక కష్టాలు - సుఖాలు వస్తూ పోతూ ఉంటాయి. సుఖాన్ని చెప్పుకోకపోవడం, కష్టాలను పదిమందికి చెప్పుకుని యేడవడం మనుషులకున్న బలహీనత. అదిగో ఆ బలహీనత తను తనకు అనుకూలంగా మలచుకుని వాస్తుపండితుడు జనా లకు దేవుడయిపోయాడు. 'వా.పం.' దేవుడయిపోయినందుకు కొండమీది దేవుడు పట్టించుకోలేదు కానీ దేవుడి దగ్గర వుండే పెద్ద పూజారి పట్టించుకున్నాడు. పట్టించుకోవాల్సి వచ్చింది.

ధర్మకర్తల సభలో గుడికి సంబంధించిన ఉత్సవ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించిన చర్చ సాగుతూండగా వాస్తు పండితుని ప్రసక్తి వచ్చింది.

ధర్మకర్త ధర్మారావు అన్నాడు -

'వాస్తుదోషం లేని కొంప లేదు ఊళ్ళో! అందుకనే ఊళ్ళో ఇన్ని ఉపద్రవాలు వచ్చిపడుతున్నాయి! అంటున్నాడు మన వా.పం.గారు. దీని గురించి నలుగురూ ఆలోచించండి!"

"ఒక్కటి మాత్రం నిజం.... గతంతో కనీవినీ ఎరుగనన్ని వింతలు - విడ్డూరాలు ఊళ్ళో జరుగుతున్నాయి. పెద్దబ్బాయి కొడుకు ఇంజనీరింగ్ చదువుతూన్న కుర్రాడు మాయం అయిపోయేడు. ఆ నూకరాజు కూతురు నలుగురు పిల్లలున్న రామమూర్తితో లేచిపోయి, పెళ్ళిచేసుకొని కాపురం పెట్టేసింది. నిన్నకాక మొన్న నారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు, పంటచేను మాడి మసయి పోయినందుకు! కాలేజీలో చదువుకుంటున్న కామాక్షిని చెఱువుగట్టున చెరచి, పీకనొక్కి చెర్లో పారేశారు ఎవరో. ఇవన్నీ వింటూవుంటే భయం కలగడం లేదూ?" అన్నాడు కోటేశ్వరరావు.

"వా.పం.గారి వాదన ప్రకారం వాస్తుదోషం వల్లనే ఇన్ని కీడులు మూడుతున్నాయి అంటాడాయన. ఆ ఇళ్ళన్నీ బద్దలు కొట్టాల్సిందేనా?" కొండారెడ్డి సందేహం.

"మరి వాస్తుందని నమ్మితే బద్దలుకొట్టక తప్పదు!" అంటూ తీర్పు ఇచ్చాడు తిరుపతయ్య!

అప్పుడు పెద్ద పూజారిగారు కలగజేసుకుని - "ఎందుకండీ! కొండంత దేవుడు మనకండగా వుండగా! సుదర్శన యాగం లోకకళ్యాణార్థం జరిపితే సరిపోతుంది. మీరంతా 'ఊ' అనండి!" అన్నారు.

* * *

యాగానికి భూమి పూజ ప్రారంభమైంది. యాగశాలానిర్మాణం పూర్తయింది. దానితో గొడవ మొదలయింది. వా.పం. వివాదం లేవదీశాడు, 'యాగశాలకు వాస్తుదోషం ఉంది. అందులో యాగం చేస్తే ఊరికి కీడు అంటూ. దీన్ని అడ్డుకోవాలని జనాలను రెచ్చగొట్టాడు వా.పం.

"దేవుడికి వాస్తేవిటి? మతిలేని మాట!" అన్నారు ప్రతివాదులు.

"పోనీ వారిమాట విని శాలను మార్చవచ్చు గదా?" అన్నారు మితవాదులు.

"అదేం కుదరదు. వారెందుకలా భయపెడుతున్నారో మాకు తెలుసు! వారిమాట పట్టుకొని మార్పు చేస్తే ఇంక అందర్నీ డాన్స్ కట్టిస్తాడు. శాట్" అన్నారు అధికారవర్గం.

యాగం పరిసమాప్తం అయింది. ఖర్చులు పోగా యాగానికి లాభాలు బాగానే వచ్చాయి.

ఊళ్ళో భయస్తులు వా.పం.గారిని కలుసుకొని తమ తమ శంకలను బయటపెట్టుకున్నారు.

"కీడు తప్పదయ్యా. ఊరిపెద్దకొకరికి మతి చలిస్తుంది, చూడండి" అంటూ వా.పం. ప్రకటించాడు. ఊరిపెద్ద అనడంలో 'పెద్ద పూజారి' అనే అతని ఉద్దేశం. తనకు అడ్డుపడుతున్నది పెద్దపూజారే కదా?

వారాలు, నెలలు గడుస్తున్నాయి కానీ పెద్ద పూజారికి పిచ్చి ఎక్కలేదు. భయస్తులు రోజూ వాకబుచేస్తూ సతమతవుతున్నారు. వా.పం.కి నిద్రపట్టడంలేదు. ఎవరికో ఒకరికి మతి భ్రమించి ఉండాలి. అది ఖాయం; కానీ ఎలా తెలుస్తుంది?

'మానస' ఆసుపత్రికి ఈమధ్యకాలంలో ఎవరైనా క్రొత్త పిచ్చివాళ్ళు వచ్చి చేరారా? అని వాకబు చేస్తే ఆలాటి కేసు రాలేదని తెలిపోయింది.

వా.పం. గారు యిదేదో తేల్చుకోవాలనుకున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు కర్ర పట్టుకుని ఎక్కేగుమ్మం, దిగే గుమ్మంగా తిరుగుతూ అందరినీ ప్రశ్నించడం మొదలు పెట్టాడు,

"మీ ఇంట్లో ఎవరికైనా హిస్టీరియా, మూర్ఛ, మద పిచ్చి గానీ వచ్చాయా?"

అందరూ ఎవరికి వారు లేదంటే లేదన్నారు. వా.పం. పట్టు వదలని విక్రమార్కునిలా నలభైరోజులపాటు, ఆ మండల ప్రాంతమంతా పాదయాత్ర చేస్తూ, ప్రశ్నిస్తూనే ఉన్నాడు!

ఊళ్ళో జనాలు 'హమ్మయ్య! మనకింక ఏ భయం లేదు. ఎవరికీ కీడు జరగదు! ఆ కీడు ఏదో అతగాడినే కొట్టేసింది. వా.పం.గారికి పిచ్చెక్కింది!" ఆవటా అనుకుని, గుండెలమీద చేతు లేసుకుని ప్రశాంతంగా పడుకున్నారు.